క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో దైవానుగ్రహం

కొత్తపల్లి: ఆధ్యాత్మిక చింతనతో దైవానుగ్రహం ఎల్లవేళలా ఉంటుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. శ్రీరామపురం గ్రామంలో సింహాద్రి అప్పన్న అచ్చు (ముద్ర) కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక భావం పెరుగుతుందన్నారు. ముఖ్యంగా గ్రామ దేవతల ఆలయాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచ్ రావి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి కబడ్డీ శిక్షణ



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పద్మనాభం

సామర్లకోట: స్థానిక ప్రతిభ హైస్కూల్ గ్రౌండ్‌లో నెల రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్త్రీ, పురుష కబడ్డీ క్రీడాకారులకు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అండర్ 14 క్రీడాకారుల మధ్య 12వ మినీ ఒలింపిక్-23 వారి సమక్షంలో స్త్రీ, పురుషులకు కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక చేయనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసు తెలిపారు. రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు పద్మనాభం ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులకు సర్టిఫికేట్లు అందజేశారు. ప్రో కబడ్డీ రీఫరీ బోగిళ్ల మురళీకుమార్, పీడీలు తాళ్లూరి వైకుంఠం, కిరణ్‌కుమార్, వీరబాబు, కోటి, నిర్వాహకులు బుల్లి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేస్తున్న ఆలయ పండితులు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీగా సత్యారెడ్డి



బాధ్యతలు స్వీకరించిన సత్యారెడ్డి

సామర్లకోట: స్థానిక మండల ప్రజాపరిషత్ ఈఓ పీఆర్డీగా కర్రి హరికృష్ణ సత్యారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సుమారు ఆరు నెలలుగా ఆ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జిగా వై.శ్రీహరి పని చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ సాధారణ బదిలీల జీఓతో పెదపూడి ఎంపీపీ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా గత ఐదేళ్లు పూర్తి చేయడంతో హరికృష్ణ సత్యారెడ్డిని సామర్లకోటకు బదిలీ చేశారు. గతంలో మండలంలో ఉండూరు పంచాయతీలో ఆయన పని చేయడంతో మండలంతో ఆయనకు అనుబంధం ఉంది. ఈఓ పీఆర్డీగా బాధ్యతలు స్వీకరించిన సత్యారెడ్డిని పరిపాలనాధికారి వి.సాయిబాబు, మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దాపురం: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఏపీజీఈఏ కార్యదర్శి డాక్టర్ డి.వీరయ్య డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం పెద్దాపురం తాలూకా యూనిట్ ఉద్యోగులు రిలే నిరహార దీక్షలు చేపట్టారు. తాలూకా అధ్యక్షుడు బీకే శర్మ అధ్యక్షతన జరిగిన దీక్షలో ఆర్‌అండ్‌బీ రాష్ట్ర అధ్యక్షులు పాపారావు, కమర్సియల్ ట్యాక్స్ జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పిఠాపురం: పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు శుక్రవారం పిఠాపురం రూరల్ పోలీసులు తెలిపారు. పి.రాయవరం శివారులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై అబ్దుల్ నబీ తన సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.6,510 నగదు స్వాధీనం చేసుకున్నారు.

నాచురల్ మేత..

- సాగుకీ, పశు పోషణకూ ఉపయుక్తం
- అజొల్లా జాతి నాచుతో 'పాడి'కి జీవం
- పెంపకానికి వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సహకారం



అజొల్లా సాగుపై రైతుకు అవగాహన కల్పిస్తున్న పీఎం నాగేశ్వరరావు

పెద్దాపురం: యంత్రాలతో పంటల కోత పచ్చగడ్డికి కొరత తెచ్చింది.. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమను కష్టాల్లో నెట్టేసింది.. అలాంటి తరుణంలో 'అజొల్లా' నాచు ఈ పరిశ్రమకూ జీవం పోస్తుంది.. పెరిగిన దాణా ఖర్చులు, పశుగ్రాసం కొరతతో పశుపోషణ కష్టంగా మారడంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో పశు సంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 18 మండలాల్లో సుమారు 3,500 మంది రైతులు ఈ అజొల్లా తయారు చేసి, పశువులకు మేతగా, ఎరువుగా వినియోగిస్తున్నారు.

బహుళ ప్రయోజనాలు

'అజొల్లా' రైతులకు ఎంతగానో ఉపకరిస్తోంది. ఫెరిని జాతికి చెందిన ఈ నాచును ఇంటి ఆవరణలోనే అత్యంత సులభంగా పెంచుకోవచ్చు. పెద్దాపురం మండలం జి.రాగంపేట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, గొల్లప్రోలు, గోకవరం, కరప, పెదపూడి, సామర్లకోట, కాజులూరు, తాళ్ళరేవు, తుని, రౌతులపూడి, అమలాపురం రూరల్, ఐనవిల్లి, ముమ్మిడివరం, కోరుకొండ, అడ్డతీగల, రాజ ఒమ్మంగి, రంపచోడవరం మండలాల్లో ఈ నాచుపై విస్తృత ప్రచారం చేపట్టి పెంచేలా చర్యలు చేపట్టారు.

పెంచే విధానం ఇది

అజొల్లా పెంపకానికి కావలసిందల్లా కొన్ని సిమ్మెంటు లేదా మామూలు ఇటుకలు, ఓ టార్పాలిన్ పట్టా, తాగునీరు, పది కేజీల పశువుల పేడ, 200 కేజీల సారవంతమైన మట్టి, ఒక కేజీ అజొల్లా. ఈ మొత్తం కోసం రైతులు ఖర్చు చేయాల్సింది కేవలం రూ. 1000. సిమెంటు వరలు కానీ, ఇటుకలతో తయారు చేసుకున్న తొట్టెలతో అజొల్లా పిట్‌ను తయారు చేసుకోవచ్చు. గ్రామంలో ఎవరైనా దీనిని పెంచుతుంటే వారి వద్ద నుంచి కొద్దిగా అజొల్లా కల్చర్‌ను తెచ్చుకుని తయారు చేసుకున్న పిట్‌లో వేస్తే చాలు జీవిత కాలం అజొల్లా పెరుగుతూనే ఉంటుంది. అవసరాన్ని బట్టి ఇంటి ఆవరణలో ఎన్ని అజొల్లా పిట్లనైనా తయారు చేసుకోవచ్చు.



అజోల్లాను మేస్తున్న కోళ్లు

ఉపయోగాలు ఇలా..

- ఆవులకు, గేదెలకు, మేకలకు, కోళ్లతో పాటు చేపలకు ఆహారంగా ఉపయోగపడుతుంది.
- ప్రతి రోజూ పాడి గేదెలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక కేజీ వంతున పాలిచ్చే పశువుకి దాణాగా పెట్టడం వల్ల మంచి వెన్న శాతంతో పాల దిగుబడి పెరుగుతుంది. దీనిలో ప్రొటీన్లు, మాంసకృత్తులు అధికంగా ఉండడం వల్ల పశువు బలిష్టంగా ఉంటుంది. పశువులు సమయానికి ఎదకి వస్తాయి. దీని వల్ల పశు సంపద పెరుగుతుంది.
- వరి పైరుకు జీవన ఎరువుగా ఉపయోగపడుతుంది. అజొల్లాను వరి పొలంలో చల్లడం వల్ల ఎకరాకు 8 నుంచి 12 కిలోల నత్రజని పైరుకు అందుతుంది.
- అజొల్లాను పొలంలో వేయడం వలన మొక్క వేర్లకు ఆక్సిజన్ తగినంత అందుతుంది. ఫలితంగా యూరియా ఉపయోగించాల్సిన అవసరం ఉండదు.
- పొలం నిండా అజొల్లా ఉండటం వల్ల నీరు త్వరగా ఆవిరి కాదు. ఫలితంగా నీటి తడులు అందించాల్సిన అవసరం చాలా తగ్గుతుంది.
- వరి పంటలో కలుపు రాకుండా అడ్డుకోవడంలో అజొల్లా ఎంతగానో ఉపయోగపడుతుంది.

పంటకు, పశువులకు మేలు



అజొల్లా వేసిన 15 రోజుల నుంచి రోజూ ఒక కేజీ వంతున పాడి పశువులకు దాణాగా వినియోగిస్తున్నాను. పాల దిగుబడే కాకుండా వెన్న శాతం కూడా పెరిగింది. వరి పంటలో కూడా అజొల్లా వేశాను. దీనివల్ల కలుపు నివారణకు దోహదపడింది. యూరియాకు బదులుగా అజొల్లాను ఉపయోగించా. ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6 వేలు ఖర్చు తగ్గింది.

– కన్నారావు, అజొల్లా సాగు రైతు, జి.రాగంపేట, పెద్దాపురం మండలం

18 మండలాల్లో అవగాహన కల్పించాం



అజొల్లా ప్రతీ రైతు ఇంట్లో పెంచుకోవాలి. దీని పెంపకంలో రైతులకు సలహాలు అందిస్తున్నాం. రైతులు కూడా అజొల్లా పట్ల ఆకర్షిలవుతున్నారు.

– బర్రె నాగేశ్వరరావు, ప్రాజెక్టు మేనేజర్, రిలయన్స్ ఫౌండేషన్, గోరింట, పెద్దాపురం మండలం

వేసవి శిక్షణతో మేధస్సుకు పదును



వేసవి శిక్షణ తరగతులలో ప్రసంగిస్తున్న విమలారాణి

పెద్దాపురం: విద్యార్థుల్లో మేధస్సును వెలికితీసేందుకు వేసవి శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయని హిందీ ఉపాధ్యాయిని వాడపల్లి విమలారాణి అన్నారు. శుక్రవారం శాఖా గ్రంథాలయంలో సిబ్బంది సింగం బుల్లియ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులను వారికి ఆసక్తి ఉన్న ఉన్న రంగాల్లో ప్రోత్సాహిస్తూ అద్భుతాలు సృష్టిస్తారన్నారు. అనంతరం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ప్రాముఖ్యంపై విద్యార్థులకు వివరించారు.

నేడు మాదాలమ్మ తల్లి జాతర

కొత్తపల్లి: గొర్స గ్రామంలో మాదాలమ్మతల్లి జాతరను శనివారం రాత్రి నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. ఆదివారం తీర్థం నిర్వహించనున్నట్లు సభ్యులు చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కొత్తపల్లి: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం జగ్గయ్య చెరువు ప్రాంతంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల నుంచి అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానికంగా రూ.20 లక్షలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన నవరత్న పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టో అంటూ టీడీపీ చేస్తున్న ప్రచారం చాలా విడ్డూరంగా ఉందన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేశానంటున్న చంద్రబాబు మళ్లీ అధికారం కోసం ప్రజలకు నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ప్రజలను బూటకపు మాటలతో నమ్మించాలని చూస్తున్నారని తెలిపారు. జగ్గయ్య చెరువును అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

పాలనా నైపుణ్యంపై జెడ్పీటీసీలకు శిక్షణ



జెడ్పీటీసీలకు శిక్షణ ఇస్తున్న కోనసీమ జిల్లా డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో ఉమ్మడి ఐదు జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులకు శుక్రవారం కోనసీమ జిల్లా డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వీవీ శివశంకరప్రసాద్ డీఆర్‌డీఏ అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. పేదరిక నిర్మూలన కోసం స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి వారికి బ్యాంకుల నుంచి రుణాలు అందజేసి ఆ రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. కోనసీమ డ్వామా పీడీ ఎస్ మధుసూదనరావు పంచాయతీల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి ఉపాధి హామీ పథకంలో చేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఉపాధి కూలీలను గుర్తించి వారికి జాబ్ కార్డులు అందజేసి తప్పని సరిగా 100 రోజుల పని కల్పించేలా చర్యలు తసుకుంటున్నట్టు తెలిపారు. కాకినాడ జిల్లా స్త్రీ-శిశుసంక్షేమ శాఖ పీడీ జి.సత్యవేణి ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు వాటి పని తీరుపై వివరించారు. ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్, మేనేజర్ పి. శ్రీనివాసరావు, సీనియర్ ఫ్యాకల్టీ శ్రీదేవి, ఎంఎస్ఎన్ రెడ్డి శిక్షణ నిర్వహించారు.

కాకినాడ-అరుణాచలం ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

కాకినాడ: కాకినాడ నుంచి అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసును అధికారులు శుక్రవారం స్థానిక డిపోలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి దర్శనం అనంతరం 5వ తేదీ రాత్రికి కాకినాడ చేరుకుంటుంది. కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, కాకినాడ డిపో అసిస్టెంట్ మేనేజర్ టి బాలకృష్ణ, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్‌వోగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

కాకినాడ సిటీ: జిల్లా పౌరసరఫరాల అధికారిగా ఎంపీ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రసాద్ తూర్పుగోదావరి జిల్లా పౌర సరఫరాల శాఖలో ఏఎస్‌వోగా పని చేస్తూ పదోన్నతిపై కాకినాడ జిల్లాకు వచ్చారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

కరప: మండలం ఉప్పలంలో శుక్రవారం హనుమాన్‌దళ్ (కాకినాడ) ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని పద్మశ్రీ పురస్కార గ్రహీత, సంకురాత్రి ఫౌండర్ సంకురాత్రి చంద్రశేఖర్ శుక్రవారం ఆవిష్కరించారు. హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం జరిగి 350 ఏళ్లయిన సందర్భంగా హనుమాన్ దళ్ ప్రతినిధులు, భక్తులు కాకినాడ నుంచి ఊరేగింపుగా ఉప్పలంక చేరుకుని విగ్రహాన్ని ఆవిష్కరించారు.

చేతల ప్రభుత్వం మనది

- రైతన్నలకు కొండంత ఆసరా
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు



రైతులకు రాయితీపై మంజూరైన ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: వైఎస్సార్ సీపీ మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. శుక్రవారం పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ప్రభుత్వం రాయితీపై అందించిన ట్రాక్టర్‌లను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును రాజుగా మార్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోందని అన్నారు. రైతన్నలకు సేవలను దరిచేర్చాలనే ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. సాగుకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు రాయితీపై అందించడమే కాకుండా యంత్ర పరికరాలను అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందించే యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పండిస్తున్న ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. వ్యవసాయ శాఖ ఏడీఏ స్వాతి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భూ హక్కు రక్షణ పథకంతో సమస్యల పరిష్కారం



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ కుమారి

సామర్లకోట: దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల కోసమే సీఎం జగనన్న శాశ్వత భూహక్కు రక్షణ పథకాన్ని ప్రవేశ పెట్టినట్టు ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. వేట్లపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి భూ హక్కు రక్షణ పథకం వివరాలను తెలిపారు. ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, పంచాయతీ కార్యదర్శి మోసే, వీఆర్వోలు, సచివాలయ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

నిప్పులు కురిపిస్తున్న భానుడు

మండే ఎండలకు హడలిపోతున్న జనం



నిర్మానుష్యంగా సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి

సామర్లకోట: వేసవి కాలంలో రోహిణి కార్తె ప్రారంభం కావడంతో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇటీవల వర్షాలు కురియడంతో ప్రజలు కొంత మేర సేదతీర్చుకున్నారు. అయితే శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతూ నిప్పులు కురిపించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఈ నెలలో పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో మండే ఎండలో వెళ్లాల్సిరావడంతో వెళ్లాలా వద్దా అని తటపటాయిస్తున్నారు. అనేక మందికి కల్యాణ మండపాలు లభించక పోవడంతో ఇళ్ల వద్ద టెంట్లు వేసి భోజనాలు ఏర్పాటు చేయడంతో టెంట్ల నుంచి మరింత వేడి దిగిపోవడంతో ప్రజలు ఆరాటానికి గురయ్యారు. ఎండలు ఎంత తీవ్రంగా ఉన్నా రైతులు, ఉద్యోగులు, ఇతర బాధ్యతలు నిర్వహిస్తున్న వారు ఎండలో తిరుగు తూనే ఉన్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. దీనికి తోడు వేడి గాలి వీయడం, సాయంత్రం ఆరు అయినా ఎండ వేడి తగ్గక పోవడంతో ప్రజలు అల్లాడి పాయారు. స్టేషన్ సెంటర్‌లోని మున్సిపల్ షాపులలోనికి నేరుగా ఎండ వస్తుండడంతో అనేక మంది వ్యాపారులు తమ తమ దుకాణాలను మూసి వేశారు. ఎండలోను తమ తమ పనులు చేసే కొవడానికి అనేక మంది తలకు రక్షణ కల్పించుకొని ప్రయాణాలు సాగించారు. శుక్రవారం సామర్లకోటలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మండే ఎండకు రోడ్డు నిర్మానుష్యంగా మారింది.



సామర్లకోటలో మూతపడిన దుకాణాలు

అగ్నిమాపక అధికారిగా రామకృష్ణరాజు



దాట్ల రామకృష్ణరాజు

పిఠాపురం: స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారిగా దాట్ల రామకృష్ణరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తుని అగ్నిమాపక కేంద్రం అధికారిగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. తొలుత సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజల్లో చైతన్యం నింపుతామన్నారు. దీనికి గాను సిబ్బంది సహకారంతో ముందుకు సాగుతామని అన్నారు. ప్రమాదాలు సంభవించిప్పుడు ప్రజలు తమ వంతు బాధ్యతగా సమాచారాన్ని చేరవేయాలన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి



శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి

సామర్లకోట: గ్రామాల్లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి అన్నారు. శుక్రవారం స్థానిక టీటీడీసీలో జిల్లాకు చెందిన డీఆర్‌డీఏలోని ఏపీఎంలు, సీసీలకు నిర్వహించిన ఒక రోజు వర్కుషాపులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామాల్లో వ్యాపారాలు చేయడానికి ఉత్సాహంగా ఉన్న మహిళలను గుర్తించి వారికి ప్రత్యేకంగా శిక్షణ నిర్వహించాలన్నారు. ఈ మేరకు వారికి కావలసిన రుణాలను బ్యాంకుల ద్వారా అందజేసేలా ఏపీఎంలు, సీసీలు కృషి చేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ద్వారా బ్యాంకుల అధికారులకు మహిళా సంఘాలకు, ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే అంశంపై నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు మహిళలను ఆయా రంగాలల్లో ప్రోత్సహించేలా పరిశ్రమల శాఖ కృషి చేస్తుందన్నారు. ఉద్యానవనశాఖ, పశుసంవర్ధకశాఖ, వ్యవసాయశాఖలకు చెందిన అధికారులు గ్రామాల్లో ఉత్సహంగా ఉన్న మహిళలను గుర్తించాలన్నారు. ప్రతి మండలం నుంచి 15 మందికి తక్కువ కాకుండా లబ్దిదారులను ఎంపిక చేసి మండలంలో మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి బ్యాంకు లింకేజ్ డీపీఎం ఎ పద్మావతి అధ్యక్షత వహించగా యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ డీవీ రంగారావు, మత్స్యశాఖ ఏడీ కరుణాకర్, పశు సంవర్ధకశాఖ ఏడీ కె.తాతయ్య, పరిశ్రమల శాఖాధికారి శ్రీనివాస్, డీపీఎంలు వీబీ రాయ్, కేశవ్, భరత్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు హాజరయ్యారు.

జిల్లా స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక



స్విమ్మింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

సామర్లకోట: స్థానిక దుర్గాప్రసాద్ పబ్లిక్ స్కూల్‌లో కాకినాడ జిల్లాకు సంబంధించిన స్విమ్మింగ్ (ఆక్వాటిక్) క్రీడాకారుల ఎంపిక శుక్రవారం జరిగింది. జిల్లా అక్వాటిక్ సంఘ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శి ఇరుసుమళ్ల రాజు, సంఘ సలహాదారుడు మంగా వెంకటశివరామకృష్ణ ఆధ్వర్యం లో జిల్లా క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల పదో తేదీన విజయవాడలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు జూలై 2 నుంచి 5 వరకు హైదరాబాద్‌లో జరిగే సీనియర్ నేషనల్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కోచ్‌లు ఎం అజయ్‌కుమార్, ఎస్‌కె రాజా, హరి, నాని క్రీడాకారులను ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో 11 మందిని, స్త్రీల విభాగంలో 12 మందిని ఎంపిక చేశారు.

పింఛను సొమ్ముకు ఎగనామం

కొత్తపల్లి: కొండెవరం సచివాలయం-2లో వెల్ఫేర్ అసిస్టెంట్ పొన్నాడ వీరబాబు పింఛను సొమ్ముతో పరారైనట్లు ఎంపీడీఓ అబ్రహం లింకన్ తెలిపారు. దీనిపై శుక్రవారం ఆయన పంచాయతీ కార్యాలయం వద్ద విచారణ నిర్వహించారు. లబ్ధిదారులకు అందించాల్సిన రూ.1,53,250 పింఛన్ల సొమ్మును అతను వలంటీర్లకు ఇవ్వలేదని గుర్తించామన్నారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎన్.ముసలయ్య మాట్లాడుతూ ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.